క్లుప్తంగా

శ్రీ పెద్దమ్మకు వెండివడ్డాణం విరాళం



వడ్డానం విరాళంగా అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లె : మండలంలోని టంగుటూరులో వెలసిన పెద్దమ్మకు గోస్పాడు మండలం కూలూరు గ్రామానికి చెందిన గుద్దేటి చిన్నరామిరెడ్డి మనవళ్లు, మనువరాలు లలిత్‌కుమార్ రెడ్డి, రూపశ్రీ, ఛత్రపతిరెడ్డి రూ.20వేల వెండి వడ్డాణం విరాళంగా అందజేశారు. ఈ మేరకు బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు దాతలు ఇచ్చారు. దాత కుటుంబ సభ్యులకు సభ్యులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రతి ఇంటిని సందర్శించాలి

సంజామల: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరావు సూచించారు. బుధవారం ముక్కమల్ల గ్రామంలో సర్వేను ఆయన తనిఖీ చేసి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య వివరాలు పక్కాగా సేకరించాలన్నారు. సర్వేలో అనుమానం ఉన్న వ్యక్తులకు బీపీ, షుగర్, మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి రెఫరల్ స్లిప్‌లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

కోవెలకుంట్ల: కోవెలకుంట్లలో బుధవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు పట్టణానికి చెందిన మురళీ, నాగేంద్ర, బాలరాజు, మరో ముగ్గురు, రాజశేఖర్, మహేష్, రాజేంద్ర, రఫీ, మరో ఏడుగురు పాత గొడవలను మనసులో పెట్టుకుని ఘర్షణ పడ్డారు. వాగ్వాదం తీవ్రస్థాయికి చేరుకుని మురళీ వర్గం ... రాజశేఖర్ వర్గంపై కత్తితో దాడి చేయగా ఇరువురు గాయపడ్డారు. ఈ మేరకు ఇరువర్గాలకు చెందిన 17 మంది కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

22న బేతంచెర్లలో 'జగనన్నకు చెబుదాం'

- హాజరు కానున్న జిల్లా కలెక్టర్

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో ఈనెల 22న జరిగే జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంగన్న బుధవారం తెలిపారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌తోపాటు జిల్లా అధికారులు హాజరవుతారన్నారు. మండల ప్రజలు తమ సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు.

ఆధార్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

కొలిమిగుండ్ల: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నందిపాడు సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. మార్పులు, చేర్పులతో పాటు కొత్తగా ఆధార్ పొందవచ్చని సూచించారు. నామ మాత్రపు ఫీజులతో ప్రత్యేక ఆధార్ క్యాంపుల్లో సేవలు అందిస్తున్నట్లు చెప్పారు.

నేడు ఆధార్ ప్రత్యేక క్యాంప్

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు, నొస్సం సచివాలయాల్లో గురువారం ఆధార్ ప్రత్యేక క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు. ప్రత్యేక క్యాంప్‌లో కొత్తగా ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఒక్కరోజు జరిగే ప్రత్యేక క్యాంప్‌ను సచివాలయాల పరిధిలోని ముదిగేడు, ఎగ్గోని, ముచ్చలపూరి, నొస్సం గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వ్యక్తిపై కత్తితో దాడి

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన యేసయ్యపై ఇదే గ్రామానికి చెందిన గడ్డం మునిస్వామి, మెట్ల నాగేశ్వరరావు, మెట్ల బాలరాజులు కత్తితో దాడికి పాల్పడినట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి బుధవారం తెలిపారు. వీరు పాత కక్ష్యలను దృష్టిలో పెట్టుకొని మంగళవారం రాత్రి యేసయ్యపై కత్తితో దాడి చేశారని, బాధితుడి అన్న కేశాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

సొంతూరిలోనే ఆధార్ సేవలు



ఆర్ లింగందిన్నె సచివాలయంలో చిన్నారికి ఆధార్ నమోదు చేస్తున్న దృశ్యం

సంజామల: ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. కమలపూరి, ఆర్ లింగందిన్నె సచివాలయాల్లో బుధవారం నిర్వహించిన ప్రత్యేక క్యాంప్‌లో ఆధార్ అప్‌డేట్, మార్పులు, చేర్పులు చేయించుకోవడంతోపాటు కొందరు కొత్తకార్డులు తీసుకున్నారు. ప్రత్యేకించి చిన్న పిల్లలకు ఆధార్ కార్డు నమోదుకు ఈ క్యాంప్ ఎంతో ఉపయోగపడింది. నెలకోసారి నిర్వహించే ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నాగకుమార్ ప్రజలకు సూచించారు.



డోన్ పట్టణంలో నిమజ్జనానికి తరలి వెళ్తున్న గణపయ్య



డప్పు వాయిద్యాల మధ్య...



ముద్దవరం గ్రామంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



పోతుదొడ్డి గ్రామంలో యువకుల కేరింతలు

గంగమ్మ ఒడికి గణనాథులు

డోన్ టౌన్ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా డోన్ మండలంలో నిమజ్జనం కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య సాగింది. మండల కేంద్రం డోన్‌తోపాటు గ్రామాల్లో మండపాల్లో కొలువుదీరిన గణపయ్యలు మూడురోజులపాటు భక్తుల పూజలు అందుకుని బుధవారం గంగమ్మ ఒడి చేరుకున్నారు. భక్తజనం సందోహం మధ్య భక్తి శ్రద్ధలతో వెంకటాపురం చెరువులో గణనాథులను నిమజ్జనం జరిగింది. మధ్యాహ్నం నుంచే పట్టణ పుర వీధుల గుండా ఊరేగింపుగా వాహనాల్లో గణేష్ విగ్రహాలను డప్పు వాయిద్యాలు, నృత్యాల మధ్య తీసుకెళ్లారు. యువత రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. గణేష్ మహరాజ్‌కు జై అంటూ చేసిన నినాదాలు మారుమోగాయి. వైఎస్సార్ సీపీ నాయకులు రాష్ట్రమీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ రాజ్‌కుమార్, కౌన్సిలరు దినేష్ గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్ తదితరులు పాత బస్టాండ్‌లో స్టేజ్ ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలు తీసుకెళ్తున్న వ్యక్తులకు సూచనలు చేశారు.

రూ. 70 వేలు పలికిన వినాయకుడి లడ్డు

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా విగ్రహాల వద్ద చవితి రోజు ఏర్పాటు చేసిన లడ్డు ప్రసాదం వేలం పాటలు పోటాపోటీగా సాగాయి. పాతపేట కురుకుంద కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డును వైజాక్‌కు చెందిన యువకుడు గౌతమ్ రూ.70వేలకు దక్కించుకున్నాడు. అలాగే ప్రజా వైద్యశాలల వీధిలో బజాజ్ షోరూం యజమాని చంద్రశేఖర్‌అప్ప గౌడ్ రూ.50వేలకు, తారకరామనగర్‌లో మస్తాన్ అనే యువకుడు రూ. 36వేలకు వేలం పాటల్లో లడ్డును సొంతం చేసుకున్నారు.



భక్తుల కోలాహలం మధ్య గణేషుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కోవెలకుంట్ల మండల పరిధిలోని గ్రామాల్లో కొలువుదీరిన గణనాథుల నిమజ్జన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వినాయక విగ్రహాలకు భక్తులు మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు చేశారు. నిమజ్జనాన్ని పురస్కరించుకుని చివరి రోజు వినాయక విగ్రహాల ఊరేగింపును వైభవంగా చేపట్టారు. యువకుల నృత్యాలు, డ్రమ్స్ మోతలు అలరించాయి. పట్టణ శివారులోని కుందూనదిలో గణపయ్యలను నిమజ్జనం చేశారు. కార్యక్రమం ప్రశాంతంగా ముగియడంతో ప్రజలు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం వినాయక నిమజ్జన కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

కొలిమిగుండ్ల: వినాయక చవితి పండుగ సందర్భంగా మూడు రోజుల పాటు పూజలందుకున్న గణనాథులను బుధవారం నిమజ్జనానికి తరలించారు. మండల కేంద్రం కొలిమిగుండ్లతోపాటు గ్రామాల్లో వివిధ రూపాల్లో కొలువుదీరిన వినాయకులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ట్రాక్టర్లలో నిమజ్జనానికి గణపయ్యలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. చిన్నా,పెద్దా తేడా లేకుండా ఒకరికొకరు రంగులు చల్లుకున్నారు. యువత కేరింతలు కొట్టారు. గ్రామాల్లో సందడి వాతావరణం ఏర్పడింది. ఆయా గ్రామాల్లో చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. అదేవిధంగా కొలిమిగుండ్లలో కొలువైన గణనాథులను అవుకు రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు.

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి, అలేబాదు, అలేబాదుతండా తదితర గ్రామాల్లో బుధవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా ముగిశాయి. ఆయా గ్రామాల్లో ఈ నెల 18 వ తేదీన గణనాథుని విగ్రహాలు ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బుధవారం గ్రామాల్లో వినాయక విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామ శివారు ప్రాంతంలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

సంజామల: మండంలో వాడవాడలో కొలువుతీరిన గణపయ్య నిమజ్జనం బుధవారం భక్తిశ్రద్ధతో నిర్వహించారు. మండల కేంద్రం సంజామలతో పాటు గ్రామాలలో దాదాపు 50 గణనాథుల విగ్రహాలు కొలువుంచారు. వినాయక విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులు, బావులలో నిమజ్జనం చేశారు.

బేతంచెర్ల : మండలంలోని గ్రామాల్లో వినాయచవితి నిమజ్జనం వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో కొలువైన వినాయకులను నిమజ్జనానికి తరలించారు. యువకుల కోలహాలం మధ్య రంగులు చల్లుకుంటూ, బాణా సంచా పేలుస్తూ కేరింతలు కొట్టారు. సీఐ ప్రియతం రెడ్డి, ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

అవుకు: మండలంలో నిమజ్జన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని ముస్లిం వీధిలో కొలువుదీరిన వినాయకుడికి నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ముడియాల జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. యువకులు పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేస్తూ కొనసాగారు. గణపతి బప్ప మోరియా అంటూ స్వామి వారికి వీడ్కోలు పలికి సాగనంపారు.



గంగమ్మఒడి చేరుతున్న బొజ్జ గణపయ్య



గంగమ్మ ఒడి చేరిన గణనాథుడు



కొలిమిగుండ్లలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణేషుడు

బనగానపల్లెరూరల్: మండలంలోని గ్రామాల్లో కొలువుదీరిన గణనాథుల నిమజ్జనం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. మీరాపురం గ్రామంలో గణనాథుడికి లడ్డూ బహిరంగవేలం వేయగా గ్రామానికి చెందిన వార్డు సభ్యులు బత్తులరామ్మోహన్‌రెడ్డి రూ.10వేలకు డి దక్కించుకున్నారు.

వైఎస్సార్‌సీపీపై చెక్కుచెదరని ప్రజాభిమానం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు

- సీఎం డోన్ బహిరంగ సభ సక్సెస్
- కృతజ్ఞతలు తెలిపిన వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ప్రజల అభిమానం చెక్కుచెదరలేదని, మంగళవారం డోన్‌లో నిర్వహించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సక్సెస్‌ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యమని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేశ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు కురుకుందు హరి పేర్కొన్నారు. సీఎం బహిరంగ సభను విజయవంతం చేసిన ప్రజలు, అభిమానులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు బుధవారం మంత్రి బుగ్గన స్వగృహంలో నిర్వహించిన సమావేశంలో వారు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం బహిరంగ సభకు హాజరైన జనాన్ని చూస్తే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జనరంజక పాలన, అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారనే విషయం మరోసారి నిరూపణ అయ్యిందన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నియోజకర్గాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారని ప్రజలు గట్టిగా విశ్వసిస్తున్నారన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్ సీపీని ఆశీర్వాదించాలని వారు కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దినేశ్ గౌడ్, ఆర్‌ఈ రాజవర్ధన్, ప్యాపిలి వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షుడు బొర్రా మల్లికార్జునరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ నేరేడుచర్ల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నలభైఏళ్లలో అభివృద్ధి శూన్యం... నాలుగేళ్లలో అగ్రగామిగా డోన్

- సీఎం సభకు ప్రజాస్పందన అపూర్వం
- ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్


బేతంచెర్ల: నలభైఏళ్లు ప్రాతినిధ్యం వహించిన అతిరథమహారథులు డోన్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి శూన్యమని, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కేవలం నాలుగేళ్లలో అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉర్దూ అకాడమి సభ్యులు మూర్తుజావలి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీ కృష్ణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా హుసేన్, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం వారు మాట్లాడారు. ఎన్నికల ముందు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఇచ్చిన సహకారంతో మంత్రి బుగ్గన డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక వసతుల కల్పన తదితర అభివృద్ధి పనులు నియోజకవర్గంలో పరుగులు పెడుతున్నాయని గుర్తు చేశారు. అందుచేతనే మంగళవారం డోన్ పట్టణంలో జరిగిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బహిరంగ సభకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందన్నారు. రైతన్నకు వెన్నుదన్నుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉందనేందుకు 77 చెర్వులకు నీరు నింపే కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారన్నారు. ఎలాంటి సాగునీటి వసతి లేని డోన్ నియోజకవర్గంలో చెర్వులకు నీరురానున్నందున రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి రూ. 340 కోట్లతోవాటర్ గ్రిడ్ ద్వారా మంచినీటి పథకానికి శాశ్వత ప్రాతిపాదికన చేపట్టిన పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. సీఎం బహిరంగ సభను విజయవంతం చేసిన ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్ మోహన్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి, ఖాజ, దస్తగిరి, శ్రీరాములు, నిరంజన్, నాగరాజు, వెంకటేశ్వర్లు, ఎద్దులన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్

పోలింగ్ బూత్‌లపై అభ్యంతరాలు తెలుపండి

డోన్ టౌన్ : రాబోయే ఎన్నికల ఎన్నికల కోసం ఏర్పాటు చేయనున్న పోలింగ్ బూత్‌లపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకి తేవాలని ఆర్డీఓ వెంకటరెడ్డి సూచించారు. ఈ మేరకు బుధవారం అఖిల పక్ష నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా నుంచి పోలింగ్ బూత్‌ల ఏర్పాటు వరకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకుల అభిప్రాయాలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో డోన్, ప్యాపిలి మండలాల తహసీల్దార్లు విద్యాసాగర్, రవీంద్రవర్మ, రెవెన్యూ అధికారులు రామకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, యూనూస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

డోన్ టౌన్ : ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టి చట్ట బద్దత కల్పించాలని మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకులు గుండాల ఈశ్వరయ్యమాదిగ, మాదిగ లాయర్ల ఫెడరేషన్ నాయకులు సదానంద బాబు, రవి ప్రకాష్, గార్లపాటి మద్దిలేటి, ఈశ్వరయ్య, మద్దయ్య, శ్యామ్‌సుందర్, జీవన్‌బాబు, చెన్న కృష్ణ,కుల్లాయప్పలు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోరుతూ ఏమ్మార్పీస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరాహార దీక్షలు బుధవారం పదవ రోజు కొనసాగించారు. దీక్షలకు లాయర్ల ఫెడరేషన్ నాయకులు మద్దతూ తెలిపారు. అక్కడి నుండి ర్యాలీగా అంబేడ్కర్ విగ్రహం చేరుకుని నిరసన తెలిపారు. నాయకులు పులికేశవయ్య మాదిగ, చిన్నరాయుడు, మదన్న, నాగేంద్ర, కంబయ్య, హుసేనప్ప, రామకృష్ణ, సురేంద్ర, జయసాయికిరణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

- ప్రతిపల్లెలో మౌలిక వసతుల కల్పన
- అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్ : ప్రజా సంక్షేమం, అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యనిస్తుందని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. పార్టీలు, కులాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు నేరుగా అందజేస్తూ పేదల ఆర్థికాభివృద్ధికి సీఎం చేయూతనివ్వడంతోపాటు ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నారన్నారు. మండలంలోని రామతీర్థం గ్రామంలో రూ.1.15 కోట్ల తో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, జీల్‌జీవన్ పథకం కింద ఏర్పాటు చేసిన మంచి నీటి పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా యంత్ర సేవ పథకం కింద రైతు సంఘానికి మంజూరైన ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే ప్రాంభించారు. అనంతరం సర్పంచ్ సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ గ్రామాల అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ గ్రామంలో మనబడి నాడు నేడు కింద జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.1.70కోట్ల, ఎంపీపీ పాఠశాలను మరో రూ.35లక్షలతో అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందన్నారు. గ్రామానికి మరో రూ.25 లక్షలు సీసీ రోడ్లు నిర్మాణానికి మంజూరు చేయడం జరిగింద న్నారు. గత నాలుగేళ్లలో 5,027 మందికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.13.45కోట్లను ప్రభుత్వం నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా గ్రామంలో 295 మంది భూమిలేని పేదలకు ప్రభుత్వం ద్వారా త్వరలో అసైన్‌మెంట్ పథకం కింద 686 ఎకరాల భూ పంపిణీకి శ్రీకారం చుట్టిన్నట్లు చెప్పారు. గతంలో ఎప్పుడూ జరగని విధంగా అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలు చేపడుతుంటే టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి, చంద్రబాబుకు తెలిసి కూడా తెలియనట్లు నటిస్తున్నారని ఎద్దేవా చేశారు. స్కిల్ కుంభకోణంలో రూ.371 కోట్ల అవినీతికి పాల్పడినందునే చంద్రబాబు అరెస్టు అయ్యారని ఆరోపించారు. 2014 ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి 600 హామీలు గుప్పించి మభ్యపెట్టారని, ఎన్నికలు సమీపిస్తుండడంతో మళ్లీ కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. మేమూ అమ్మ ఒడి ఇస్తాం... సిలిండర్లు పంపిణీ చేస్తా....మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అంటూ మరోమారు మోసగించేందుకు వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల వద్దకే పాలన సాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, పీఆర్ డీఈఈ నాగ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఉమాకాంత్‌రెడ్డి, పీఆర్ ఏఈ రమణ, ఏఓ సుబ్బారెడ్డి, ఎంపీపీ మానసవీణ, మండల ఉపాధ్యక్షురాలు ఎం లక్ష్మీదేవి, మాజీ కో ఆప్షన్ సభ్యులు బషీర్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ యవజన విభాగం అధ్యక్షులు గుండం నాగేశ్వరరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇమాంఖాసీం, జిల్లెల్ల శివరామిరెడ్డి, తిమ్మరాజు, పుల్లయ్య, బాలుడు, డీలర్ నారాయణ, అల్లె సురేష్‌రెడ్డి, ఈశ్వర్‌నాయక్, శ్రీనివాసులు, సంటెన్న తదితరులు పాల్గొన్నారు.



రూ.21.90లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ఆయుర్వేద విశిష్ట వైద్యశాలను అభివృద్ధి చేస్తాం

- భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే కాటసాని
- ఆయుర్వేద వైద్యకళాశాల ఏర్పాటుకు కృషి

బనగానపల్లెరూరల్ : పట్టణంలోని కాశయ్యతోటలో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద విశిష్ట వైద్యశాలను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని, పూర్వవైభవం తెస్తామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. రూ.80లక్షలతో చేపట్టిన ఆయుర్వేద విశిష్ట వైద్యశాల నూతన భవన నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం కాటసాని మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యశాల భవన పరిస్థితి పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని గుర్తు చేశారు. వైద్యశాలలో సరియైన సౌకర్యాలు లేనందున దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు సూదుర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితిని గమనించి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రూ.80లక్షలు మంజూరు చేశారన్నారు. రూ.56.25లక్షలు వైద్యశాల భవన నిర్మాణానికి, మిగిలిన మొత్తాన్ని ఇతర పరికరాల కొనుగోలుకు వెచ్చిస్తామన్నారు. ఆయుర్వేద వైద్యశాలను అన్నివిధాలుగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఆయుర్వేద వైద్యశాల సుమారు తొమ్మిది ఎకరముల విస్తీర్ణంలో ఉందని, ఇక్కడ ఆయుర్వేద వైద్య కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయుష్ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కుమార్‌బాబు, వైద్యశాల చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవరావు చౌదరి, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాణి, బనగానపల్లె ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, కాంట్రాక్టర్ మట్ట హరి, ఎంపీడీఓ శివరామయ్య, ఈఓ ఖలీల్, ఎంపీపీ మానసవీణ, పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ, బనగానపల్లె వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు సన్నల జనార్ధన్‌రెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు కాటసాని తిరుపాల్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, షేక్ ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, న్యాయవాది మాధవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బండిబ్రహ్మానందరెడ్డి, నీలిశ్రీనివాసులు, ప్రతాప్‌రెడ్డి, అల్లిపుశేన్, కంబగిరి, యల్లయ్య, ఈశ్వర్ నాయక్, శంకర్‌రెడ్డి, సురేష్, బాలరాజు,నరసింహారెడ్డి, బాలు, దేవుడు, గాధంశెట్టి వేనుగోపాల్ శెట్టి, ఆర్యవైశ్య సంఘం నాయకులు డి వెంకటసుబ్బయ్య, పారిశ్రామికవేత్త మహబూబ్‌వలి తదితరులు పాల్గొన్నారు.



ఆయుర్వేద వైద్యశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సంక్షిప్తం

నీటిలో పడిన అమ్మాయిని రక్షించిన చైర్మన్

డోన్ టౌన్: నిమజ్జనం చూడటానికి వచ్చిన అమ్మాయి కాలు జారి చెరువులో పడటంతో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ స్పందించి రక్షించారు. బుధవారం వినాయక నిమజ్జనం సందర్భంగా మండలంలోని వెంకటాపురం చెరువులో డోన్ మున్సిపల్ ఆధ్వర్యంలో నిమజ్జనం ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ చెరువు దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నాడు. ఓ అమ్మాయి సెల్ఫీ తీసుకుంటూ పొరపాటున చెరువులో పడింది. గమనించిన రాజేష్ వెంటనే అమ్మాయిని కాపాడుతుండగా పోలీసులు సాయం చేశారు.

వరుసగా గుర్తు తెలియని బైకులు

డోన్ టౌన్ : పాతపేట సమీపంలోని హిందూ శ్మశాన వాటికకు వెళ్లే రహదారిలో గత వారంరోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు మోటార్ సైకిల్‌ను వదిలి వెళ్లిన సంఘటన పట్టణ ప్రజలు మరచి పోకముందు ఉడుములపాడు గ్రామంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై మంగళవారం రాత్రి హీరో హోండా దర్శనమిచ్చింది. బైకులు ఎందుకు ఇలా వదిలి వెళుతున్నారనే విషయం అర్థమవ్వక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి

కోవెలకుంట్ల: రబీ సీజన్ వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్నందున రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని ఏఓ నిరంజన్ సూచించారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని విత్తన దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. విత్తనాల స్టాక్ రిజిస్టర్లు, విత్తన గోదాములను పరిశీలించారు.

పకడ్బందీగా ఆరోగ్య సురక్ష సర్వే

అవుకు: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆరోగ్య సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని చెర్లోపల్లెలో జరుగుతున్న సర్వేను ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్లు వినోద్ కుమార్, యమునాలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రజల ఆరోగ్య పరిస్థితులను పక్కాగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ మల్లేశ్వరి, హెల్త్ సూపర్ వైజర్లు వేణుగోపాలరాజు, దానమ్మ, సీహెచ్‌ఓలు కళ్యాణి, శ్రీలేఖ పాల్గొన్నారు.

ఎస్సార్‌బీసీకి 1500 క్యూసెక్కులు

బనగానపల్లె: గోరుకల్లు రిజర్వాయర్‌కు అనుసంధానంగా ఉన్న ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వకు 1500 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. ప్రారంభంలో 500 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేసిన అధికారులు రైతుల అవసరాల కోసం 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు గోరుకల్లు రిజర్వాయర్ అధికారులు పేర్కొంటున్నారు. ఎస్సార్‌బీసీ ద్వారా విడుదల చేసిన నీరు ఆయకట్టు పరిధిలోని 1.62లక్షల ఆయకట్టుకు సాగునీటిని అందించడమేకాకుండా అవుకు రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తున్నారు. అవుకు రిజర్వాయర్ నుంచి ఆయకట్టు పరిధిలోని సుమారు 6వేల ఎకరాలకు సాగునీరు అందుంతుంది. ఎస్సార్‌బీసీ ఆయకట్టు పరిధిలో ప్రస్తుతం వరి, మొక్క జొన్న, మినుము, పత్తి తదితర పంటలు సాగు అయ్యాయి.